## క్లుప్తంగా

### రామాలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పెద్దశంకరంపేట(మెదక్): పేటలోని పురాతన రామాలయ పునర్నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ఆలయ కమిటీ అధ్యక్షుడు గుజ్జరి కనకరాజు పనులను ప్రారంభించారు. అదేవిధంగా బెస్తవాడలోని దుర్గమ్మ ఆలయానికి ఎంపీపీ జంగం శ్రీనివాస్‌లు భూమిపూజ నిర్వహించారు. ఆలయ నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని వారు కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మురళీపంతులు, ఎంపీటీసీ వీణసుభాశ్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు కందుకూరి రవీందర్, రాగం శ్రీను, నర్సింలు, దశ్వంత్, అన్నారం సత్యనారాయణ, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### మూగజీవాలకు తాగునీటి కష్టం



నీళ్లు తాగేందుకు అవస్థలు పడుతున్న వానరం

మెదక్‌జోన్: మెదక్ డిపోలో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన ఓ నల్ల వద్ద వానరం తన దాహం తీర్చుకునేందుకు నానా తిప్పలు పడింది. నల్ల నుంచి వచ్చే నీటి బొట్టు కోసం 15 నిమిషాల పాటు పడరాని పాట్లు పడి తన దాహం తీర్చుకొని వెళ్లిపోయింది ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

### 'నిందితులను అరెస్ట్ చేయాలి'

మెదక్ మున్సిపాలిటీ: విద్యుత్ లైన్‌మెన్ రాజును కులం పేరుతో దూషించిన నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని డీబీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం మెదక్‌లో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, జిల్లా అధ్యక్షుడు దుబాషి సంజీవ్‌లు మాట్లాడుతూ.. నిజాంపేట మండల పరిధిలో విద్యుత్ లైన్‌మెన్‌గా రాజు పని చేస్తున్నాడు. కాగా శివ్వాయిపల్లికి విద్యుత్ స్తంభాలు పంపడంలో వివాదాన్ని సృష్టించిన అపరేటర్ కుమారస్వామి అకారణంగా రాజును కులం పేరుతో దూషించి, వారి యూనియన్ సంఘం నాయకులతో బెదిరింపులకు గురి చేశాడన్నారు. నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైనందున నిందితడిని తక్షణమే అరెస్ట్ చేయాలన్నారు.

### విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు ప్రదానం చేస్తున్న నాయకులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని వరుగుంతం గ్రామంలో వరిగుంతం క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలు నాలుగురోజులుగా కొనసాగాయి. బుధవారం ఫైనల్ మ్యాచ్ శివాజీ వారియర్స్, ఈగల్ ఎలెవెన్ మధ్య జరగగా విజేతగా శివాజీ వారియర్స్ ట్రోఫీని దక్కించుకుంది. విజేత జట్టుకు టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి సౌజన్యంతో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లేశంగౌడ్ ట్రోఫీతో పాటు రూ.20నగదును అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి మహేశ్వర్‌రెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, అక్రమ్, శ్రీనివాస్, శ్రీకాంత్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### కారు బోల్తా.. వ్యక్తికి స్వల్పగాయాలు

టేక్మాల్(మెదక్): అదుపు తప్పి కారు బోల్తాపడిన సంఘటన టేక్మాల్ మండలంలోని కాద్లూర్ శివారులో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని షాబాద్‌తండా పంచాయతీ పరిధిలోని నల్లకుంట తండాకు చెందిన వాసు, వీరేశంలు అల్లాదుర్గం నుంచి ఏపీ28డీఆర్9497 కారులో మేకలను తీసుకొని ఇంటికి వెళ్తున్నారు. మార్గమధ్యలో బొడ్మట్‌పల్లి-మెదక్ ప్రధాన రహదారి వద్ద కాద్లూర్ శివారులో కారు అదుపుతప్పి బోల్తా కొట్టింది. కారులో ఉన్న వాసుకి స్వల్ప గాయాలయ్యాయి.

### రోడ్డుపై నిలిపిన బైక్ చోరీ

నర్సాపూర్: నర్సాపూర్ మెయిన్ రోడ్డుపై మంగళవారం రాత్రి నిలిపిన బైక్ చోరీకి గురైంది. నర్సాపూర్‌కు చెందిన వినోద్‌కుమార్ పట్టణంలోని మెయిన్ రోడ్డుపై ఉన్న గోల్డెన్ చికెన్ సెంటరు ఎదురుగా మంగళవారం రాత్రి సుమారు ఎనిమిది గంటల సమయంలో తన బైక్ టీఎస్ 35సి 1849ను నిలిపి అక్కడికి సమీపంలోని దుకాణానికి వెళ్లానని చెప్పారు. తన పని ముగించుకొని వచ్చి చూసే సరికి తన బైక్ కన్పించలేదని ఆయన చెప్పాడు. చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వినోద్ కుమార్ చెప్పారు. ఈ విషయమై ఎస్‌ఐ శివకుమార్‌ను అడగగా ఫిర్యాదు అందిందని, విచారణ చేస్తున్నామని చెప్పారు.

# ఖర్చులు పెట్టిస్తారు.. బిల్లులు ఇవ్వరు!

**చిలప్‌చెడ్ మండల సమావేశంలో సర్పంచ్‌ల నిరుత్సాహం**



ఎంపీపీ, ఎంపీడీఓలను నిలదీస్తున్న సర్పంచ్‌లు

చిలప్‌చెడ్(నర్సాపూర్): దశాబ్ది ఉత్సవాలు, పండగలు అంటూ అధికారులు లేనిపోని ఖర్చులు పెట్టిస్తున్నారని.. బిల్లులు మాత్రం ఇవ్వడం లేదని మండల సర్పంచ్‌లు నిరుత్సాహం వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రమైన చిలప్‌చెడ్ ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ వినోదరెడ్డి అధ్యక్షతన ఎంపీడీఓ శశిప్రభ సమక్షంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు.

- ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ ఆదర్శ్‌కుమార్ మాట్లాడుతూ.. బీసీ కులవృత్తుల రుణాలు మంజూరు కావడంతో మండలంలో ఒకేసారి కుల, ఆదాయ ధ్రువపత్రాలకు దరఖాస్తులు చేసుకోవడంతో సైట్ క్లోజ్ అయిందని, అభ్యర్థులు ఓపికతో ఉండాలన్నారు.
- సీఆర్‌పీ రాజశేఖర్ మాట్లాడుతూ.. మండలంలో 11 పాఠశాలలకు గానూ 8 పాఠశాలల్లో 'మన ఊరు-మన బడి' పనులు జరుగుతుండగా, అజ్జమర్రి పాఠశాలలో పనులు పూర్తయ్యాయన్నారు. ఈ సారి కొత్తగా ఒకటో తరగతిలో 197 మంది జాయిన్ అయ్యారన్నారు.
- మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ.. ఈ సీజన్‌లో 14 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ప్రస్తుతం ఎరువులు, యూరియా అందుబాటులో ఉందన్నారు.
- ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కిషన్ మాట్లాడుతూ.. ఈ నెల 18 తేదీన మంచి నీళ్ల పండగను ఘనంగా నిర్వహించాలని కోరగా, అడ్డుకున్న సర్పంచ్‌లు గ్రామాల్లో నీళ్లే సక్రమంగా రావడం లేదని, పైగా పండగలు అవసరమా అని ప్రశ్నించారు.
- విద్యుత్‌శాఖ ఏఈ రాంబాబు మాట్లాడుతూ.. మండలంలో చాలా వరకు విద్యుత్ సమస్యలు పరిష్కరించామని, మండలంలోని ఏ గ్రామాలకైనా విద్యుత్ సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి దరఖాస్తు ఇవ్వాలన్నారు. గాలివానకు 70 స్తంభాలు విరిగిపోతే, దాదాపుగా 90 శాతం పనులు పూర్తి చేశామన్నారు.
- ఎఆర్‌ఏఈ మధుబాబు మాట్లాడుతూ.. మండలంలో 9 గ్రామ పంచాయతీ భవనాలకు రూ 1.80 కోట్లు మంజూరయ్యాయన్నారు. మండలంలో 'మన ఊరు-మన బడి' పనులకు రూ.577లక్షలు మంజూరు కాగా, ఇప్పటివరకు రూ.2కోట్ల పనులు పూర్తి చేశామన్నారు.
- ఏపీఓ శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ.. వర్షాకాలం వస్తున్నందున వృక్షమాల పేరుతో చెరువులు, ఏటి అంచున మొక్కలు నాటాలని, సంపద మాల పేరుతో 2వేల మొక్కలు నాటేందుకు ప్రణాళిక తయారు చేశామన్నారు.
- ఎంపీపీ వినోదరెడ్డి మాట్లాడుతూ.. అధికారులు తప్పనిసరిగా ప్రజల సమస్యలు తీర్చే విధంగా తమ విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ విక్రమ్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అన్వేశ్‌రెడ్డి, ఏపీఎం ప్రేమలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత, మండల సర్పంచ్‌లు ఫోరం అధ్యక్షురాలు లక్ష్మీరెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు షఫీ, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసాలు



పెద్దశంకరంపేట(మెదక్): అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు



రామాయంపేట(మెదక్): శేరిపల్లి ప్రాథమిక పాఠశాలలో..



టేక్మాల్‌లో..



చిలప్‌చెడ్(నర్సాపూర్): అజ్జమర్రి పాఠశాలలో..

పెద్దశంకరంపేట(మెదక్): పేట మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో సామూహిక అక్షరా భ్యాస వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం ఆయా పాఠశాలల్లో ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, సర్పంచ్‌లు, తల్లిందండ్రులు, ఉపాధ్యాయులు సరస్వతీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం చిన్నారులతో అక్షరాలను దిద్దించారు. ప్రభు త్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలపై తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరించారు.

రామాయంపేట(మెదక్): నార్సింగి మండలం శేరిపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభం కాగా, బడిబాట కార్యక్రమంలో భాగంగా అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించినట్లు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మధురవాణి పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు తిరుపతి, మాధవి, రాజు, యాదగిరి, శ్రీధర్, జయంతి, సీఆర్‌పీ శాంతికుమార్, ఉపసర్పంచ్ భాగ్యలక్ష్మి, ఎస్ఎంసీ చైర్మన్లు స్వామి, చెప్యాల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

టేక్మాల్(మెదక్): బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన టేక్మాల్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ చింత స్వప్నరవి, సర్పంచ్ నాయికోటి సుప్రజభాస్కర్‌లు పాల్గొని విద్యార్థులకు అక్షరాలను దిద్దించారు. మండలంలోని దనూర ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ ఎల్లంపల్లి గౌతంరాజ్ చిన్నారులతో అక్షరాలు దిద్దించారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం చిలప్‌చెడ్ మండలం అజ్జమర్రి గ్రామ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు అక్షరాభాస్యం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల హెచ్‌ఎం నరేశ్, సర్పంచ్ పరశురాంరెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ వీరస్వామిలు చిన్నారులకు పలకలు అందజేసి అక్షరాభాస్యం చేయించారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని కామారం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పూలపల్లి యాదగిరి చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు.

తూప్రాన్: మండలంలోని కిష్టాపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు సిబ్బంది బాడిబాట కార్యక్రమంలో అక్షరాభ్యాసం చేయించారు. దీంతో పాఠశాలలో పండగ వాతవరణం నెలకొంది. కార్యాక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### పాఠశాలలో ప్రొజెక్టర్ ధ్వంసం



తొలగించిన ప్రొజెక్టర్

వెల్దుర్తి(తూప్రాన్): మండల పరిధి బండపోసానిపల్లిలో మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు సోని డిజిటల్ డివైస్‌ను ధ్వంసం చేసిన సంఘటన ఉన్నత పాఠశాలలో చోటు చేసుకుంది. హెచ్‌ఎం రాంకిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం పాఠశాలకు వచ్చి చూడగా డిజిటల్ గది తాళం పగలగొట్టి ఉన్న విషయం గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి గదిలో ఉన్న పలు వస్తువులు చిందరవందరగా పడేయడంతో పాటు కేబుల్ వైర్లు తొలగించి, డిజిటల్ డివైస్ ప్రొజెక్టర్‌ని సీలింగ్ నుంచి తొలగించి గదిలో ధ్వంసం చేశారు. ఎలాంటి వస్తువులు చోరీ కానప్పటికీ విలువైన వస్తువులు ధ్వంసం చేశారు. చోరీ సంఘటనపై పాఠశాల హెచ్‌ఎం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

### మడేలేశ్వరస్వామికి పూజలు



మడేలేశ్వరస్వామి సన్నిధిలో ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల పరిధిలోని నందిగామ గ్రామంలో బుధవారం నూతనంగా నిర్మించిన ఆలయంలో మడేలేశ్వరస్వామిని ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ మేరకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రజక సంఘం నాయకులు వారిని సన్మానించారు. కార్యక్రమంలో రజక సంఘం జిల్లా అధ్యక్షుడు స్వామి, ఎంపీపీ సిద్దరాములు, ఇతర బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు.

### సైబర్ నేరాలపై అవగాహన

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో ఏఎస్‌ఐ జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫోన్‌కి ఏదైనా ఓటీపీ వచ్చినా, బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నాం మాకు ఓటీపీ చెప్పండి అంటూ ఫోన్లు వస్తే వారిపై జాగ్రత్త వహించాలన్నారు. అదేవిధంగా గ్రామంలో ఎవరైనా అపరిచిత వ్యక్తులు తిరిగినట్లయితే వెంటనే 100 డయల్ చేసి వారికి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ కృష్ణ, సాయిబాబ, తదితర పోలీస్ సిబ్బందిలు పాల్గొన్నారు.

## ధాన్యం డబ్బులు ఇప్పించాలి



నిరసన తెలుపుతున్న రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మినా సకాలంలో డబ్బులు రాకపోవడంపై మండల పరధి చెన్నాపూర్ గ్రామ రైతులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ధాన్యం అమ్మకం చేపట్టి 15 రోజులు గడుస్తున్నా నేటికీ తమ ఖాతాల్లో డబ్బులు జమకాలేదని వాపోయారు. తూకం వేసిన రెండు రోజుల్లో ఖాతాల్లో డబ్బులు పడతాయని చెప్పిన అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వర్షాకాలం పంటలకు విత్తనాలు తెచ్చుకునేందుకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సాగుకోసం అప్పులు ఇచ్చిన వారు ఇబ్బందులు పెడుతున్నారని సకాలంలో డబ్బులు చేతికందకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. పాఠశాలలు, కాలేజీలు ప్రారంభం కావడంతో ఫీజులు కట్టాల్సి ఉందని, సంబంధిత అధికారులు స్పందించి ధాన్యం డబ్బులు ఇప్పించాలని కోరారు.

## ఫిల్లింగ్ ద ఫేమస్ క్యాంపెయిన్



రెడ్డిపల్లి పెట్రోల్ బంక్‌లో క్యాంపెయిన్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ లక్ష్మి

చేగుంట(తూప్రాన్): ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బుధవారం రెడ్డిపల్లి మహాలక్ష్మి పెట్రోల్ పంప్‌లో ఫిల్లింగ్ ద ఫేమస్ క్యాంపెయిన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ సేల్స్ మేనేజర్ ప్రణయ్ స్థానిక సర్పంచ్ లక్ష్మితో క్యాంపెయిన్‌ను ప్రారంభించారు. ఇండియన్ ఆయిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌ల నాణ్యమైన సేవలపై స్థానిక వినియోగదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాలచందర్, నిర్వాహకులు ప్రశాంత్, ప్రవీణ్, ఎంపీటీసీ రవి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ



ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో నిర్వాహకులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని బిజ్లిపూర్ గ్రామంలో వీరాంజనేయస్వామితో పాటు పలు దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం కనుల పండువగా జరిగింది. మూడు రోజుల పాటు పండితులు నిర్వహించిన పూజా కార్యక్రమాలు బుధవారం ముగిశాయి. చివరిరోజు గ్రామంలో వీరాంజనేయస్వామితో పాటు 23 గ్రామ దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, బలిదానం, పూర్ణాహుతి నిర్వహించడంతో పాటు భక్తులకు అన్నదానం నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యేను నిర్వాహకులు సన్మానించారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని జగ్గంపేట గ్రామంలో బుధవారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి ఆధర్వంలో ఆంజనేయ, నంది, గణపతి, లింగం విగ్రహ ప్రతిష్ఠాపనలతో పాటు, ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ మహోత్సవాలకు హాజరైన నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమీషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డిలు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపించారు.

## రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనాలి

**టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్**



క్విజ్ పోటీలపై అవగాహన కల్పిస్తున్న నాయకులు

పెద్దశంకరంపేట(మెదక్): ఈ నెల 18న రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని టీపీసీసీ సభ్యుడు కర్నె శ్రీనివాస్ అన్నారు. బుధవారం పెద్దశంకరంపేట మండలం బుజ్రాన్‌పల్లి, టెంకటి, చీలాపల్లి గ్రామాల్లో 18న జరగబోయే క్విజ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. పోటీల్లో గెలుపొందిన వారికి నియోజకవర్గానికి ఒకరికి ఎలక్ట్రిక్ బైక్‌తో పాటు ల్యాప్‌టాప్, స్మార్ట్‌ఫోన్‌లు అందిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఈ పోటీల్లో యువత పాల్గొనాలని ఆయన కోరారు. క్విజ్ పోటీల్లో పాల్గొనేవారు ఈనెల 17 శనివారంలోగా తమ పేర్లను 7661 899899 నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాయిని మధు, నాయకులు విఠల్, యూత్ అధ్యక్షుడు జైపాల్‌గౌడ్, జహంగీర్, మహిపాల్‌గౌడ్, శివ, రాజు, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాలకు ఆహ్వానం



ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డితో నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని అంబాజీపేట గ్రామంలో ఈ నెల 16న జరిగే దుర్గామాత బోనాల ఉత్సవాలకు మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని గ్రామస్తులు ఆహ్వానించారు. బుధవారం మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసిన గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పట్లోరి మాధవి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు, అంబాజీపేట గ్రామ నాయకులు ద్యాప బాలకిషన్, రవిగౌడ్, సాన మోహన్, చాకలి రాములు, నర్సింలు, మంగలి శ్రీను, బైండ్ల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా మట్టి అక్రమ రవాణా

- అడ్డుకున్న కొండాపూర్, ముప్పిరెడ్డిపల్లి గ్రామస్తులు
- టిప్పర్లను పట్టుకున్న రెవెన్యూ అధికారులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులో అనుమతుల పేరుతో కొన్ని రోజులుగా బీఆర్‌ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు ఇష్టారీతిన అక్రమంగా మట్టి రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని కొండాపూర్, ముప్పిరెడ్డిపల్లికి చెందిన కొంతమంది ఆరోపించారు. ఈ విషయంపై ఇరు గ్రామాలకు చెందిన కొందరు మట్టి అక్రమ రవాణాను అడ్డుకొని రెవెన్యూ అధికారులకు సమాచారమిచ్చారు. బుధవారం మనోహరాబాద్ మండలం కొండాపూర్ గ్రామ శివారులో కొన్నిరోజులుగా అక్రమంగా మట్టి రవాణా చేస్తుండటంతో స్థానికులు అడ్డుకున్నారు. రెవెన్యూ ఆర్‌ఐ దీక్షిత్, తహసీల్దార్ భిక్షపతి ఆదేశాల మేరకు కొండాపూర్ శివారులో 4 టిప్పర్లను పట్టుకొని పోలీస్‌లకు అప్పగించారు. ఈ మేరకు ఎస్‌ఐ సందీప్‌రెడ్డి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## సంక్షేమ పథకాలు బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం

**జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత**

తూప్రాన్: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు బీఆర్‌ఎస్ పార్టీతోనే సాధ్యమని జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత అన్నారు. బుధవారం పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ అమర్‌సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ వైద్యారోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ రవీందర్‌గౌడ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి న్యూట్రీషన్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### దరఖాస్తు గడువు పొడిగించాలి

రామాయంపేట(మెదక్): బీసీ కులవృత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం ప్రకటించినా లబ్ధిదారులు మీసేవ కార్యాలయం చుట్టూ తిరుగుతుండగా, సర్వర్ డౌన్‌తో ఇబ్బందులపాలవుతున్నారని బీసీ సంక్షేమ సంఘం మెదక్ నియోజకవర్గ కన్వీనర్ మామిడి సిద్దరాంలు ఆరోపించారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. మీ సేవ కేంద్రాల్లో సర్వర్ డౌన్ సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు లబ్ధిదారుల ఓపికను పరీక్షించొద్దని ఆయన సూచించారు. దరఖాస్తు గడువు ఈ నెల 20 వరకు ఉండగా, దానిని పొడిగించాలని విజ్ఞప్తి చేశారు.

# ఆరోగ్య తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం



నర్సాపూర్: రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తదితరులు



కౌడిపల్లి పీహెచ్‌సీలో న్యూట్రీషన్ కిట్స్ పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాజునాయక్



టేక్మాల్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

శివ్వంపేట(నర్సాపూర్): ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా సీఎం కేసీఆర్ వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నారని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ అమలు కానీ పథకాలు తెలంగాణలో అమలవుతున్న విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో వైద్యురాలు సంధ్య, బీఆర్‌ఎస్ నాయకులు జంగం వెంకటేశ్, కొడకంచి శ్రీనివాస్‌గౌడ్, రవినాయక్ తదితరులు ఉన్నారు.

**నార్సింగిలో..**

రామాయంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం వైద్యారోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి డాక్టర్ సాయికిరణ్ అధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బాబు, ఎంపీటీసీ సత్యనారాయణ, నాయకులు మల్లేశంగౌడ్, ఇతర నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లి పీహెచ్‌సీలో రోగులకు బుధవారం ఎంపీపీ రాజునాయక్ న్యూట్రీషన్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ మెరుగైన విద్య, వైద్యం కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వైద్య కళాశాలలు ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మంజులశివంజనేయులు, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, వార్డుసభ్యులు తిరుమలేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

**నర్సాపూర్‌లో..**

నర్సాపూర్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి పండ్లు బ్రెడ్లు పంపిణీ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మిర్జానజీంబేగ్ పండ్ల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేయగా స్థానిక ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని చికిత్స పొందుతున్న వారికి పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. పలువురిని పలకరించి వైద్యం ఎలా అందుతుందని ఆరా తీయగా బాగుందని వారు చెప్పారు. మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన అఖిల కూతురును ఎమ్మెల్యే ఎత్తుకొని తల్లీబిడ్డల ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డాక్టర్ గురుకృష్ణ, ఇతర సిబ్బందితో పాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

టేక్మాల్(మెదక్): మండల కేంద్రమైన టేక్మాల్ ఆరోగ్య కేంద్రంలో వైద్యారోగ్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రోగులకు పండ్ల పంపిణీ చేసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చింత స్వప్నరవి, సర్పంచ్ సుప్రజభాస్కర్, వైద్యులు డాక్టర్ శాలిని, డాక్టర్ కృతిక, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వీరప్ప, వైద్యసిబ్బంది నాయకులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఆవరణలో ముగ్గులపోటీ నిర్వహించారు. పదేళ్లలో అందుబాటులోకి వచ్చిన వైద్య సేవలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ హృదయ్, ఎంపీహెచ్ఓ యాదగిరిరావు, వైద్య సిబ్బంది రాజేష్ తదితరులు పాల్గొన్నారు.